క్లుప్తంగా

రైల్వే ఆస్తులు ధ్వంసం చేస్తే కఠిన శిక్షలు



తెనాలిరూరల్: రైల్వే ఆస్తులను ధ్వంసం చేయడం, నష్ట పరచడం వంటి చర్యలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడే అవకాశముందని తెనాలి రైల్వేస్టేషన్ మేనేజర్ టీవీ రమణ తెలిపారు. రైల్వే రూల్స్, రైళ్ల మీద రాళ్లతో దాడి చేడం, లెవల్‌క్రాసింగ్ వద్ద పాటించాల్సిన నిబంధనల గురించి రైల్వే అధికారులతో కలిసి మంగళవారం ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. తెనాలి మోరిస్‌పేటలోని రేపల్లె గేటు వద్ద ప్రజలతో మాట్లాడారు. రైల్వే ఆస్తులను నష్టం కలిగించూడదన్నారు. ప్రత్యేక న్యాయస్థానాల ద్వారా కఠిన శిక్షలు పడతాయన్నారు. రైల్వే శిక్షాస్మృతి గురించి వివరించారు. ఆయన వెంట ఆపరేషన్ సేఫ్టీ కౌన్సెలర్‌ఎంవీఎస్ గురునాథ్, ఇంజినీరింగ్ సేఫటీ కౌన్సెలర్ జి. హరినారాయణ, సిబ్బంది ఉన్నారు.

ప్రముఖ పసుపు వ్యాపారి జంపాల మృతి



దుగ్గిరాల(తెనాలి): ప్రముఖ పసుపు వ్యాపారి జంపాల వెంకట కృష్ణారావు(82) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఉన్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పసుపు వాణిజ్య కేంద్రమైన దుగ్గిరాలలో ప్రముఖ వ్యాపారుల్లో వెంకట కృష్ణారావు ఒకరుగా గుర్తింపు పొందారు. గ్రామ రాజకీయాలపై ఆసక్తితో 40 ఏళ్ల క్రితం గ్రామ సర్పంచిగా పోటీచేసి భారీ మెజారిటీతో గెలుపొందారు. రెండో సార్లు సర్పంచిగా పనిచేశారు. దుగ్గిరాల మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగానూ ఎన్నికయ్యారు. రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడిగానూ వ్యవహరించారు. తెనాలిలోని ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి కమిటీలోనూ కృష్ణారావు కొనసాగారు. కృష్ణారావు అంతిమయాత్రను బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జంపాల మృతికి సంతాపంగా దుగ్గిరాల మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించారు.

వాటర్‌ట్యాంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన



గుంటూరు రూరల్: చిన్న పలకలూరు గ్రామంలో తాగునీటి వసతి కల్పించేందుకు వాటర్ ట్యాంక్ ఏర్పాటుకు మండల వెస్ట్ తహసీల్దారు సాంబశివరావు మంగళవారం స్థల పరిశీలన చేశారు. జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు గ్రామ ప్రజల తాగునీటి సమస్యను తహసీల్దారుకు వివరించారు. వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. దీంతో స్థల పరిశీలన చేపట్టినట్లు తహసీల్దారు తెలిపారు. కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు.

అర్చకుల వేతనం పెంపునకు కృషి

గుంటూరు ఈస్ట్: కొత్తపేటలోని దేవదాయ, ధర్మాదాయ శాఖ కార్యాలయంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ బొంతు మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఈఓలు, అర్చకులు, సిబ్బందికి మంగళవారం సమావేశం నిర్వహించారు. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ అర్చకులకు రైతు భరోసా కింద వచ్చే ప్రతిఫలాన్ని అందేలా చూడాలన్నారు. అన్యాక్రాంత భూములను గుర్తించి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్చకులకు కనీస వేతనం పెరిగేలా చూడాలన్నారు. రూ. 5వేలు జీతం వచ్చేవారికి రూ. 10వేలు, రూ. 10వేలు జీతం వచ్చేవారికి రూ. 15వేలకు జీతాలు పెంచాలన్నారు. అర్హులైన అర్చకులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఇల్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జగనన్న కాలనీ పథకంలో, దేవదాయ శాఖకు చెందిన భూముల్లో ఇళ్లు నిర్మించి ఇచ్చేలా కృషి చేయాలన్నారు. భూముల వివరాలు సర్వే నంబర్లతో సహా వెబ్‌సైట్‌లో అప్‌లోడు చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, ఆర్.రమణమ్మ, ఈఓలు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన ఖోఖో పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రీడా సాధనతో చక్కని ఆరోగ్యమేకాకుండా జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా అధిగమించాలో తెలుస్తుందని పొన్నూరు శాసన సభ్యుడు కిలారి రోశయ్య తెలిపారు. మంగళవారం స్థానిక విద్యానగర్‌లోని లిటిల్ ఫ్లవర్ ఈఎం స్కూల్లో ఆంధ్ర, తెలంగాణ స్థాయి అండర్-14, 17, 19 ఖోఖో పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ పోటీలో విజయాలు సాధించడకంటే పోటీల్లో పాల్గొనడమే ప్రధానంగా భావించాలన్నారు. విజయం సాధించే ముందు పొందే ఓటములే ఉన్నత జీవితానికి పునాదులన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని క్రీడలవైపు ప్రోత్సహించాలని కోరారు. బిషప్ మాట్లాడుతూ ఈ పోటీలు 3 రోజులపాటు కొనసాగుతాయన్నారు. సుమారు 600 మంది వీటిలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. స్కూల్ సిస్టర్ హెలెన్, ప్రిన్సిపాల్ ఫాదర్ భరత్ రెడ్డి, సవేరి, ఆచార్య సురేష్ కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

- కంచర్లపాలెంలో రికార్డుస్థాయిలో 2821 సర్టిఫికెట్ల పంపిణీ
- నిజమైన ప్రజల వద్దకు పరిపాలన అంటే ఇదేనన్న ఎమ్మెల్యే శివకుమార్
- జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలని సూచన

తెనాలిటౌన్: రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ముంగిటకు తీసుకొచ్చారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. రూరల్ మండల గ్రామం కంచర్లపాలెంలోని గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష ప్రత్యేక సభకు తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శివకుమార్ రికార్డు స్థాయిలో మొత్తం 2821 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సభలో మాట్లాడుతూ పేదవాడి జీవన ప్రమాణాలు పెంచటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. ఇందుకోసం పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ఎలాంటి అవినీతి లేకుండా మధ్యదళారులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లో సంక్షేమ లబ్ధిని జమచేస్తున్నట్టు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేగా తాను ప్రతి ఇంటిని సందర్శించి వారికి అందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తున్నట్టు గుర్తుచేశారు. ఏదైనా కారణంపై సంక్షేమం నిలిచిపోయినా, విచారించి సాంకేతిక సమస్యలను తొలగించి మరీ ఆయా పథకాలను పునరుద్ధరిస్తున్నామని గుర్తుచేశారు. అవసరమైన కుల, ఆదాయ, వివాహ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, కౌలురైతుల గుర్తింపు కార్డు సహా మొత్తం 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా సత్వరం అందజేసేందుకు ప్రభుత్వం, 'జగనన్న సురక్ష'ను తీసుకొచ్చిందన్నారు. గ్రామ వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి, వారి అవసరాలను తెలుసుకుని స్వయంగా దరఖాస్తు చేయించి, జగనన్న సురక్ష సభల్లో ఆయా సర్టిఫికెట్లను పైసా ఖర్చులేకుండా అందజేస్తున్నామని తెలియజేశారు. కంచర్లపాలెం సచివాలయంలోనే 2821 మందికి రికార్డుస్థాయిలో సర్టిఫికెట్లను అందజేయటం విశేషమన్నారు. గ్రామ సర్పంచ్ కోపల్లె మణిమ్మ, సురేష్, ఎంపీటీసీలు ధర్మరాజుల చెన్నకేశవులు, పంచాయతీ కార్యదర్శి వినయ్‌బాబు, వీఆర్వో రాంబాబు, వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లినేని బుజ్జి, కఠెవరపు శివయ్య, వాకా శ్రీనివాసరావు, రవీంద్రబాబు, రాజేష్, కోపల్లె వంశీ, బుల్లా వాసు, దేవరపల్లి ప్రకాష్, వలంటీర్లు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కంచర్లపాలెంలో సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిలో ఒకటో తేదీనే 36 వేలమందికి పింఛన్లు

తెనాలి: సంక్షేమం, అభివృద్ధితోపాటు అవసరమైన సేవలను సత్వరం అందించటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఇంటిముంగిటకు పరిపాలనను తీసుకొచ్చినట్టు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. పట్టణంలోని 5, 6 వార్డుల పరిధిలో నందులపేట శివాజీపార్కులో జగనన్న సురక్ష సభను మంగళవారం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ, అర్హులైన పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేసి, ఆ వివరాలను తెలియజేస్తూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటి తలుపు తట్టినపుడు ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ పద్మావతి, సర్పంచ్ రాధిక, అధికారులు

ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందన్నారు. ఆ క్రమంలోనే 11 రకాల సర్టిఫికెట్లను సత్వరం అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష చేపట్టినట్టు ఎమ్మెల్యే శివకుమార్ చెప్పారు. పట్టణంలోని ప్రతి వార్డులో 500 నుంచి 700 వరకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఎక్కడా ఎలాంటి అవినీతి లేకుండా ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతిరూపాయి నేరుగా ప్రజలకు చేరుతోందని చెబుతూ ఆ ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వార్డు ఇన్‌చార్జి హేమలత, రాష్ట్ర జల వనరుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, షేక్ దుబాయ్‌బాబు, కో-ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, పార్టీ నేతలు ఢాకా అంకిరెడ్డి, కన్నెగంటి గోపీచంద్, చాన్‌భాషా, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, చుండూరు సాయి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి ప్లాట్స్‌లో .....

అనంతరం 30, 32 వార్డులకు చెంచుపేటలోని అమరావతి కాలనీలో జరిగిన సభకు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు అధ్యక్షత వహించారు.ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ 711 మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లను అవ్వాతాతలకు వలంటీర్లచే అందిస్తున్నామని తెలిపారు. ఇంత గొప్ప వ్యవస్థ దేశంలో మరెక్కడా లేదన్నారు. గతంలో జన్మభూమి కమిటీలు చెబితేనే పింఛను ఇచ్చేవారనీ, అదికూడా ఎక్కడెక్కడ ఎలా ఇచ్చేవారో అందరికీ తెలుసునని అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో తానే స్వయంగా వచ్చి, అందించిన లబ్ధిని వివరిస్తున్నానని గుర్తుచేశారు. కౌన్సిలర్లు కొమరాబత్తిని జయపాల్, మట్లపూడి సంధ్యారాణి మాట్లాడారు. కౌన్సిలర్లు మొగల్ అహ్మద్, కొర్ర యశోద, ఈద్గా అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, గుమ్మడి నారాయణరావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే జగనన్న సురక్ష

కొల్లిపర: ప్రజా సంక్షేమం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక అన్నారు. మంగళవారం స్థానిక సచివాలయం 1, 2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సేవలను దృష్టిలో ఉంచుకుని 11 రకాల సేవలను సచివాలయాల ద్వారా ఉచితంగా అందించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం రెండు సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న సుమారు 400 మందికి పలు రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దారు జి.నాంచారయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.చంద్రమోహన్, ఎంపీటీసీ కె.శ్రీలత, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, కళ్ళం వీరారెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, పిల్లి గంగాధర్ , పంచాయతీ కార్యదర్శి భార్గవ , సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌చే వైద్యవిద్యార్థులకు రూ.40 వేల సాయం

తెనాలి: రోటరీ క్లబ్ తెనాలి సేవలు శ్లాఘనీయమని రోటరీ క్లబ్ (నెం.3150) అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని క్లబ్ కార్యాలయంలో మంగళవారం వైద్యవిద్యార్థులకు రూ.40 వేల ఆర్థిక సహాయం అందించారు. క్లబ్ తెనాలి అధ్యక్షుడు పావులూరి రాంబాబు అధ్యక్షత వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో రోటరీ క్లబ్ సేవల్ని మరింత విస్తృతం చేయాలని సూచించారు. రోటరీ సేవల్లో తన వంతు సాయం అందిస్తానని గణేష్ యూత్ వీరవల్లి మురళి చెప్పారు. క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన రూరల్ మండల గ్రామం అంగల కుదురులో ఉచిత నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ షబీనాకు రూ.50 వేల ఆర్థికసాయం అందించనున్నట్టు తెలిపారు. వైద్యవిద్యార్థులు నిడుముక్కల మహేష్, మౌనిలకు ఆర్థికసాయం అందించిన కె.సుబ్రహ్మణ్యం, క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, జెట్టి శివరామకృష్ణప్రసాద్, ఈదర వెంకట పూర్ణచంద్, జీవీ నారాయణ, ప్రవీణ్, ఆలపాటి కిరణ్, నాగభూషణం పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న క్లబ్ బాధ్యులు

ఓటర్ల జాబితా సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలి



వివిధ రాజకీయ పార్టీల నాయకులతో చర్చిస్తున్న ఆర్డీవో పార్థసారథి

రేపల్లె: ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి ఆగస్ట్ 21వ తేదీ వరకు డివిజన్‌లో ఓటర్ల జాబితా సవరణపై జరిగే ఇంటింటి సర్వేకు సంబంధించి అధికారులకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఆర్డీవో జగన్నాథం పార్థసారథి కోరారు. డివిజన్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల రోజుల పాటు బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులకు కచ్చితమైన సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జాబితాలో తప్పొప్పులపై ఆయా పార్టీల వద్ద ఏదైనా సమాచారం ఉంటే తమకు అందించి, సవరణలకు సహకరించాలని ఆర్డీఓ కోరారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ యువకులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ అంశంపై అధికారులతో పాటు రాజకీయ పార్టీలు యువతను చైతన్యపరిచి వారు ఓటు హక్కు పొందేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు అల్లంశెట్టి శ్రీనివాసరావు, మణిలాల్, రాసంశెట్టి మహేష్, బేతపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నవరత్న పథకాలతో ఇంటింటా సంతోషం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

కొల్లిపర: పేదల జీవన ప్రమాణాలు మెరుగుపచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలతో ఇంటింటా సంతోషం వెల్లివిరుస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మంగళవారం కొల్లిపర గ్రామ పంచాయతీ పరిధిలోని సచివాలయం 1లో నాలుగవ రోజు స్థానిక కొల్లి వారి రామాలయం వద్ద నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రామాలయం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే ఆలయంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రజా సమస్యలను అడిగి తెలుకుంటున్నారు. ఎవరైనా సమస్యలు తెలిపితే వెంటనే సంబంధింత అధికారిని పిలిచి వారివద్దనే సమస్య పరిష్కరిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి(శివకోటి), పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, ఎంపీటీసీలు కె.శ్రీలత, చిలువూరి ఝాన్సీ, మర్రెడ్డి మాధవి, తుమాటి భీమారాణి, గ్రామ నాయకులు బొమ్మారెడ్డి ప్రభాకర రెడ్డి, జొన్నల అమ్మిరెడ్డి, కూరపాటి రవిశేఖర రెడ్డి , కళ్ళం వీరారెడ్డి, జొన్నలశివారెడ్డి, నెర్లకు టుంబరెడ్డి , బొమ్ము మహేశ్వరరెడ్డి, ఆర్యవైశ్య జిల్లా ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్, సొసైటీ అధ్యక్షులు బొంతు శ్రీనివాసరెడ్డి,వార్డు మెంబర్లు, తహసీల్దారు జి.నాంచారయ్యా, ఎంపీడీవో చంద్రమోహన్, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



కొల్లిపర సచివాలయం 1 పరిధిలో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

బాల్య వివాహాల నిషేధంపై అవగాహన

గుంటూరు రూరల్: బాల్య వివాహాలు చట్టప్రకారం నేరమని, ఉమెన్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్ జిల్లా అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని అంకిరెడ్డిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే దుష్పరిణామాలు వివరించారు. సచివాలయ మహిళా పోలీసు సుగుణకుమారి విద్యార్థులకు బాల్యం, మానసిక పరిపక్వత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్స్, స్కూల్ సిబ్బంది, డ్వాక్రా, ఆశా, అంగన్వాడీ టీచర్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధికారి విజయ్‌కుమార్

● ఈ బురద రోడ్డు చూడతరమా !



ట్రాక్టర్లలో తరలిస్తున్న బురదతో మట్టిరోడ్డు దుస్థితి

తెనాలి: అసలే వర్షాకాలం పనులు...అవికూడా బురద పనులు...ఆ బురదను తరలిస్తూ, నిక్షేపంలాంటి రోడ్డంతా బురదమయం చేసేస్తున్నారు...వర్షపు జల్లులతో జర్రున జారుతూ వాహనచోదకులకు ఆ రోడ్డు భీతిని గొలుపుతోంది. అంతేకాకుండా సమీపంలోని మట్టిరోడ్డు పక్కన జలమయమైన ప్రైవేటు ఖాళీస్థలంలోకి బురదను చేరేస్తున్నారు. చెరువును మెరక చేసే ఈ ప్రయత్నంలో ఆ మట్టిరోడ్డు నామరూపాలను కోల్పోయింది...నడిచేందుకూ్కడా అవకాశం లేకుండా అడుగేస్తే సర్రుమంటూ జారుతోంది. ఇక ద్విచక్రవాహనాలు ఆ మట్టిరోడ్డులో వెళ్లేందుకు వీల్లేకుండా ఉంది. ఇవన్నీ ఇలా ఉంచితే సమీప అపార్టుమెంట్లలో నివసించే గృహస్థులకు మురుగు కంపు పెట్టారు. తట్టుకోలేకపోతున్నాం...అంటూ వారంతా బెంబేలు పడుతున్నారు. బుర్రిపాలెంరోడ్డులోని పాలాద్రి కాల్వ వంతెన నుండి మొదలయే పంటకాల్వల మరమ్మతులతో వచ్చిన తంటా ఇది. వేసవిలోనో, చలిరోజుల్లోనే చేపట్టాల్సిన పనుల్ని తీరా వర్షాలు కురుస్తున్న సమయంలో మొదలెట్టారు. పైన పూడిక మట్టిని రోడ్డు పక్కనే పోస్తూ, బురదను మాత్రం ట్రాక్టర్లతో పాలాద్రి కాల్వ కుడి కట్టపై గల మట్టిరోడ్డుకు తరలిస్తున్నారు. అక్కడి ప్రైవేటు వ్యక్తుల ఖాళీస్థలాన్ని మెరక చేస్తున్నారు. దీనితో అటు నిత్యం వేలాదిమంది విద్యార్థులు, బుర్రిపాలెం టు చిలుమూరు వరకు వెళ్లే వాహనాలతో రద్దీగా ఉండే ప్రధానమైన రోడ్డు, పాలాద్రికాల్వ వంతెన నుంచి నాజరుపేటకు దారితీసే మట్టిరోడ్డు బురదమయం చేసేశారు. ఆ ప్రాంతవాసులు ఇళ్లలో ఉండలేని విధంగా మురుగు కంపు కొట్టిస్తున్నారు. వారం రోజులుగా జరుగుతున్న ఈ తంతు సంబంధిత అధికారులకు పట్టలేదు.



పంటకాల్వలో పొక్లయిన్‌తో పూడిక తీత



అపార్టుమెంట్ల పక్కనే ఖాళీస్థలంలో వేసిన బురద

● తాగునీటి పైపు లైను ఏర్పాటు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ చిర్రావూరులో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.20 లక్షలతో తాగునీటి పైపు లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఏఈ కిషోర్ తెలిపిన వివరాలు.. చిర్రావూరు పంచాయతీగా ఉన్న సమయంలో తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశారని తెలిపారు.

రైల్వే క్వార్టర్స్‌లో గుర్తు తెలియని మృతదేహం

తెనాలిరూరల్: తెనాలి రైల్వేస్టేషన్ ఒకటో నంబరు ప్లాట్‌ఫాం శివారున ఉన్న రైల్వే క్వార్టర్స్ ఆవరణలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించి పోలీసులకు సమాచార మిచ్చారు. త్రీ టౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించగా సుమారు 40 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిఉన్నట్లు తెలిపారు. మృతదేహంపై ఎటువంటి దుస్తులు లేవు. మృతి చెంది వారం రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు స్థానికులను విచారించగా రైల్వే స్టేషన్ పరిసరాల్లో యాచిస్తూ జీవించేవాడని తెలిసింది. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం. విజయ్‌కుమార్ తెలిపారు.

ఇసుక లారీలు సీజ్

తెనాలిరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సీజ్ చేశారు. కొల్లిపర వద్ద ఇసుక అక్రమంగా తరలుతోందన్న సమాచారంతో తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రెండు లారీలకు ఎటువంటి అనుమతులు లేకుండ ఇసుకను తరలిస్తున్నట్టు గుర్తించారు. వాహనాలను సీజ్ చేసి కొల్లిపర పోలీసులకు అప్పగించారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: తెనాలి మార్కెట్ ఏరియాలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 1500 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరు పరచనున్నట్టు పోలీసులు తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రేపల్లె: నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ మాణిక్యం మంగళవారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆమె వివరాలు వెల్లడించారు. నగరం మండలంలోని అద్దంకివారిపాలెం, చినమట్లపూడి గ్రామాల్లో కార్యకర్త పోస్టులు, తాడివాకవారిపాలెం, శివంగులపాలెం, కొలగానివారిపాలెం గ్రామాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాని, ఓసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పెద్దవరం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టుకు బీసీ-బి అభ్యర్థి, రేపల్లె మండలం నల్లూరుపాలెం-1లో ఆయా పోస్టుకు ఓసీ(ఓహెచ్), నల్లూరు నార్త్‌లో ఆయా పోస్టుకు బీసీ-డీ, రేపల్లె టౌన్‌లోని 23, 26 వార్డులకు సంబంధించిన ఓల్డ్ బరియల్ గ్రౌండ్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టుకు బీసీ-డీ అభ్యర్థి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తకు 10వ తరగతి, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు గ్రామ పరిధిలో నివాసం కలిగి, వివాహితులై ఉండాలన్నారు. 21 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని అన్నారు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తును స్వయంగా అందజేయాలని చెప్పారు. పూర్తి వివరాలకు సంబంధిత అంగన్‌వాడీ కేంద్రంలోగాని, ఐసీడీఎస్ కార్యాలయంలోగాని సంప్రదించాలన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం



రేపల్లె రూరల్: దోమల నివారణతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని డాక్టర్ షేక్ నేషీన్ అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవం సందర్భంగా రేపల్లె అర్బన్ హెల్త్‌సెంటర్ సిబ్బంది పట్టణంలోని ట్రిబుల్ ఎస్ హైస్కూలు విద్యార్థులతో మంగళవారం చేపట్టిన ర్యాలీని, ఆమె ప్రారంభించారు. పరిసర ప్రాంతాల్లో కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ సీసాల్లో వర్షపు నీరు చేరి దోమల వృద్ధికి కారణమవుతాయని తెలిపారు. వారంలో ఒక రోజు డ్రైడేని పాటించాలని సూచించారు. ఇంట్లో ఎవరైన జ్వరం, ఇతర వ్యాధులు బారిన పడితే.. వెంటనే వైద్యులను సంప్రదించి, చికిత్స అందించాలని తెలిపారు. అనంతరం పురవీధుల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మలేరియా శాఖ సూపర్‌వైజర్ ఎం.యల్లయ్య, డీపీఎంవో రత్నాంజలి, హెచ్ఏం కె.మణిమాల, ఏఎన్ఎంలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.